సాక్షి వైఎస్సార్ జిల్లా

బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



రిమ్స్‌కు మరో 19 పీజీ వైద్య సీట్లు

కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)కు తాజాగా మూడు విభాగాల్లో 19 పీజీ వైద్య విద్య సీట్లు మంజూరయ్యాయి. - 8లో



గంజాయి ముఠా ఆటకట్టు

గుర్రంకొండలో గంజాయి విక్రయిస్తున్న 12 మంది ముఠా సభ్యుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



ఈత.. కడుపు కోత

కలసపాడు మండలంలో సరదాగా ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి మృత్యువాతపడ్డాడు. - 8లో



బడి తెరిచిన రోజే విద్యా కానుక

- మరింత స్పీడ్‌గా, పారదర్శకంగా..
- 2023–24 ఏడాదికి జేవీకే కిట్లు పంపిణీకి సిద్ధమవుతున్న అధికారులు
- గతానికి భిన్నంగా మండల స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు
- జేవీకే కిట్ల నిల్వ, రవాణాకు జిల్లా, మండల స్థాయి కమిటీల ఏర్పాటు
- వ్యక్తిగతంగా విద్యార్థుల కొలతలను సేకరించిన అధికారులు
- మారిన యూనిఫాం రంగు



మైదుకూరు మండలంలో ఏర్పాటు చేసిన విద్యాకానుక పర్యవేక్షణ కమిటీతో చర్చిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు సత్యనారాయణ

కడప ఎడ్యుకేషన్‌: పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదు. విద్యతోనే అభివృద్ధి సాధ్యం అని తలచిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో నాడు - నేడు కింద పలు పాఠశాలలను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం రెండవ విడత పనులను కూడా ప్రారంభించి ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. దీంతోపాటు పేద పిల్లల చదువుకు ఊతమిచ్చేలా 8 రకాల విద్యాసామగ్రిని జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్ల రూపంలో అందిస్తున్నారు. వీటిని పాఠశాలలు తెరిచే రోజే పిల్లలకు అందించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టారు.

- ఈ ఏడాది పంపిణీలో మరింత పారదర్శకతతో పాటు వేగంగా విద్యాకానుక అందించేందుకు కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. దీంతోపాటు ఈ ఏడాది విద్యాకానుక సామగ్రిని ఆయా మండలాల హెడ్‌క్వార్టర్స్‌కు నేరుగా వచ్చేలా చర్యలను చేపట్టారు. దీంతో పంపిణీలో జాప్యం తగ్గి పిల్లలకు సకాలంలో విద్యాకానుక అందుతుంది.

2023–24 విద్యా సంవత్సరానికి...

జిల్లాకు 2023–24 విద్యా సంవత్సరానికి 1,58,721 జగనన్న విద్యాకానుకలు అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో మూడు జతల యూనిఫాం, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, స్కూల్ బ్యాగులను 1 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ అందించనున్నారు. బెల్టులకు సంబంధించి 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు, 1 నుంచి 5వ తరగతి వరకు బాలికలకు అందించనున్నారు. అలాగే నోట్‌బుక్స్‌ను 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందించనున్నారు. డిక్షనరీలు 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు చదివే విద్యార్థులకు అందించనున్నారు. బడి తెరిచిన రోజు విద్యార్థులందరికీ అందచేసేందుకు అని చర్యలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి గతేడాది డిసెంబర్ నుంచే విద్యార్థుల వివరాలను సేకరించడంతోపాటు వారికి సరిపడే విధంగా బూట్ల, యూనిఫాం కొలతలను కూడా సేకరించి ఉన్నతాధికారులకు వివరాలను అందచేశారు.

తరగతి	కేటాయింపు	విద్యార్థులు
1 నుంచి 10	3 జతల యూనిఫాం	1,58,721
1 నుంచి 10	జత బూట్లు, 2 జతల సాక్స్	1,58,721
1 నుంచి 10	స్కూల్ బ్యాగ్	1,58,721
1 నుంచి 10 (బాలురకు) 1 నుంచి 5 (బాలికలకు)	బెల్ట్	1,15,533
6 నుంచి 10	నోట్ బుక్స్	80,780
1 నుంచి 6	డిక్షనరీలు	28,725

మండలస్థాయిలో స్టాక్ పాయింట్లు

జగనన్న విద్యాకానుకను గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది మరింతగా విద్యార్థులకు చేరువ చేసేందుకు ప్రతి మండల కేంద్రంలో ఒక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. విద్యాకానుకకు సంబంధించిన సామగ్రి జిల్లాస్టాక్ పాయింట్‌కు కాకుండా ఈ ఏడాది నేరుగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కు రానున్నాయి. స్టాక్ పాయింట్‌కు వచ్చిన వస్తువులన్నింటికీ ఒక కిట్టు రూపంలో సిద్ధం చేసి అన్ని వస్తువులను ఒకే సారి విద్యార్థులకు అందించనున్నారు. దీంతోపాటు వీటి పంపిణీ పర్యవేక్షణకు ఒక కమిటీని కూడా నియమించారు. ఇందులో స్టోరేజీ పాయింట్ చైర్మన్‌ ఎంఈఓను, కన్వీనర్‌గా పాఠశాల హెచ్‌ఎంను, సభ్యులుగా వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం, మండల ఇంజనీరు అధికారి, సీఆర్‌పీలను నియమించారు. వీరంతా విద్యాకానుక కిట్లు రాష్ట్రం నుంచి మండల స్టోరేజీ పాయింట్లకు వచ్చిన సామగ్రిని పరిశీలించి దిగుమతి చేసుకోవాల్సి ఉంది. దీంతోపాటు స్టాక్ వివరాలకు సంబంధించి రిజిస్టర్ నోట్ చేయాల్సి ఉంటుంది. అక్కడి నుంచి పాఠశాలలకు చేర వేసే సమయంలో కూడా అన్ని రికార్డులను మెయింటెనెన్స్ చేయాల్సి ఉంటుంది.

స్టోరేజీ పాయింట్లను తనిఖీ చేస్తున్న రాష్ట్ర పరిశీలకులు...

జిల్లాలో స్టోరేజీ పాయింట్ తనిఖీ కోసం రాష్ట్రస్థాయి అధికారి సత్యనారాయణను పరిశీలకులుగా నియమించారు. ఈయన ఈ నెల 8వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్లను పరిశీలిస్తున్నారు. స్టోరేజీ పాయింట్లలో వసతి ఉందా లేదా, విద్యుత్ సౌకర్యం ఎలా ఉన్నాయని పరిశీలిస్తున్నారు. జేవీకేలో అందించే యూనిఫాం, బ్యాగు, షూస్, నోట్‌బుక్స్, డిక్షనరీలు, పాఠ్యపుస్తకాలు తదితర సామగ్రి పాడవకుండా ఉండేందుకు తీసుకున్న చర్యలను ప్రధానంగా పరిశీలిస్తున్నారు. వర్షం పడినా జేవీకే సామగ్రి తడవకుండా ఉండేందుకు అన్ని రక్షణ చర్యలను అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లాలోని పలు మండల కేంద్రాలలోని స్టాక్‌పాయింట్లను పరిశీలించారు. ఈ పరిశీలకులు మరో మూడు రోజులపాటు పర్యవేక్షించనున్నారు.



అన్ని ఏర్పాట్లను పరిశీలిస్తున్నాం...



జగనన్న విద్యాకానుక కోసం మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్టోరేజ్ పాయింట్లను పరిశీలిస్తున్నాం. అందులో తగినంత వర్షం వస్తే ఏమైనా తడుస్తాయా, విద్యాకానుక కిట్లకు భద్రత ఎలా ఉందనే అంశాలన్నింటినీ పరిశీలిస్తున్నాం. దీంతోపాటు విద్యాకానుక పంపిణీకి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీలతో చర్చిస్తున్నాం. వారికి తగిన సూచనలు, సలహాలను కూడా ఇచ్చాం. స్టోరేజీ పాయింట్లలో ఏర్పాట్లు బాగున్నాయి. విద్యాకానుక వస్తువులను మండలస్టాక్ పాయింట్లకు తరలించేందుకు ఆర్‌టీసీతో ఎంఓయూ చేసుకునేందుకు ప్రభుత్వం చర్యలను చేపట్టింది. – సత్యనారాయణ, జేవీకే రాష్ట్ర పరిశీలకులు, ఎస్పీడీ ఆఫీస్ ప్లానింగ్ కో–ఆర్డినేటర్

మార్గదర్శకాలు ఇచ్చాం..



2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జేవీకే కిట్టును విద్యార్థులకు సాకాలంలో అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టింది. దీంతోపాటు ఈ ఏడాది నూతనంగా మండలస్థాయిలో స్టోరేజీ పాయింట్లను గుర్తించాం. జేవీకే సామగ్రి ఇప్పుడు నేరుగా మండలస్థాయి స్టోరేజీ పాయింట్లకు చేరుతుంది. ఇక్కడికి రాగానే కిట్టుకు సంబంధించిన అన్ని సామాన్లను ఒక కిట్టులో సిద్ధం చేసి విద్యార్థికి పాఠశాల తెరిచే రోజు అందచేస్తాం. ఇందుకు సంబంధించి ఎంఈఓకు మార్గదర్శకాలను సూచించాం. – మిట్టా శేశవరెడ్డి, సీఎంఓ, సమగ్రశిక్ష

ఏర్పాట్లు చేస్తున్నాం...



విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో బడి తెరిచిన రోజే జగనన్న విద్యాకానుక కిట్టు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రతిపాదనలు పంపాం. 6వ తరగతి విద్యార్థులకు అందించే డిక్షనరీలు మరో రెండు రోజుల్లో జిల్లాకు రానున్నాయి. మిగతా విద్యా సామగ్రి కూడా ఈనెల 15వ తేదీ తరువాత రానుంది. వచ్చిన స్టాక్‌ను వచ్చినట్లుగా మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు పంపిస్తాం. అక్కడ అన్ని వస్తువులను ఒక కిట్ రూపంలో సిద్ధం చేసి బడి తెరిచిన రోజే విద్యార్థులకు అందిస్తాం. – అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా అధికారి

న్యూస్‌రీల్

13న నియామక పత్రాలు అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వేశాఖలో వివిధ ఉద్యోగాలకు ఎంపికైన వారికి గురువారం నియామక పత్రాలు అందజేయనున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. గుంతకల్లు డివిజన్ కేంద్రంలో జరిగే కార్యక్రమంలో కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి రావు సాహెబ్ పాటిల్ దన్వే పాల్గొని అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీసీ ద్వారా దేశంలోని 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 45 ప్రదేశాలలో ఈ నియామక పత్రాలను అందజేసే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేయబడిన వివిధ పోస్టులలో చేరనున్న వారు తమకు కేటాయించిన కేంద్రానికి వెళ్లి నియామకపత్రాలు అందుకోవాలని ఆయన సూచించారు.

పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ



పీజీ దంత వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

కడప అర్బన్: రిమ్స్‌లోని దంత వైద్య పీజీ విద్యార్థులు సింపోజియమ్‌లో ప్రతిభ చాటారు. ఈ నెల 1, 2 తేదీలలో వారణాసిలో నేషనల్ ట్రిపుల్ ఓ సింపోజియమ్ నిర్వహించగా, ఆ కార్యక్రమంలో కడప రిమ్స్‌లోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల, ఆసుపత్రిలోని పీజీ వైద్య విద్యార్థులు ప్రతిభభ చాటారు. ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ విభాగానికి చెందిన నలుగురు పీజీ విద్యార్థులు మోనీషా, కరణ్, అర్పితా, రమాదేవిలు ఒకేసారిగా, వివిధ విభాగాల్లో, విడివిడిగా మొదటి బెస్ట్ పేపర్ ప్రెజెంటేషన్ అవార్డులను సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడి డాక్టర్ కె. రమేష్ కుమార్, బోధనా సిబ్బంది వారిని అభినందించారు.

నేడు డీఎస్సీ 98 అభ్యర్థులకు కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో డీఎస్సీ 1998లో ఎస్‌జీటీగా క్వాలిఫై అయిన అభ్యర్థులకు బుధవారం కడప డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. కాంట్రాక్టు బేసిస్‌లో మినిమం టైం స్కేల్ కింద పనిచేయుటకు ఆసక్తి కనబరిచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరై కన్ఫర్మ్ అయిన అభ్యర్థులంతా తప్పనిసరిగా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. కడప జిల్లాలో 172 ఎస్‌జీటీ పోస్టుల నియామకం జరుపనున్నట్లు తెలిపారు. డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు కడప డీఈఓ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచి జాబితాలో ఉన్న అభ్యర్థులు క్రమసంఖ్య 1 నుంచి 172 వరకు అభ్యర్థులంతా డీఈఓ కార్యాలయంలో తప్పక హాజరుకావాలని తెలిపారు. అభ్యర్థులు వారి వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డు, 3 సెట్లను పాస్‌పోర్టు సైజు ఫోటోలతో కౌన్సెలింగ్ కేంద్రానికి ఉదయం 10 గంటలకు హాజరు కావాలని డీఈఓ తెలిపారు.

సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తూ మృతి చెందిన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఆరు జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి మంగళవారం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. డిప్యూటీ సీపీఎం రాజా గజలక్ష్మి, కర్నూలు డిప్యూటీ సీఎంఈ రజియా సుల్తాన, అనంతపురం పర్సనల్ ఆఫీసర్ చెంద్రాయుడు జోన్ వ్యాప్తంగా 41 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా ఉద్యోగాలకు సంబంధించిన డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి 10, కర్నూలు 14, అనంతపురం జిల్లాకు చెందిన 17 మంది సర్టిఫికెట్ల పరిశీలకు వచ్చారన్నారు. వీరిలో అర్హులైన వారిచే ఆయా పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. పరిశీలనకు వచ్చిన సర్టిఫికెట్లను ఉన్నతాధికారులకు పంపుతున్నామని, అర్హత కలిగిన అభ్యర్థులతో ఉద్యోగ నియామకాలు చేపడతామన్నారు.

ఆదర్శప్రాయుడు మహాత్మా జ్యోతిరావు పూలే

- ఎన్‌టీఆర్, వైఎస్సార్ తర్వాత బీసీలకు మేలు చేసింది జగనే
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి
- పార్టీ కార్యాలయంలో ఘనంగా మహాత్మా పూలే జయంతి



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: దివంగత ఎన్‌టీఆర్, వైఎస్సార్‌ల తర్వాత బీసీలకు మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పూలే జయంతి సందర్భంగా ఇక్కడి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్‌లతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ తర్వాత మహాత్మా అని పిలిపించుకున్న ఏకైక నేత జ్యోతీరావు పూలే అన్నారు. సమాజంలోని అసమానతలు, వివక్ష, అంటరానితనాన్ని రూపుమాపడానికి పూలే ఎంతో కృషి చేశారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. ఎస్సీ, బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా చేయని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేసి పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల్లో చెప్పిన హామీలేకాకుండా, చెప్పని హామీలు కూడా అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు పెత్తందారులకే మేలు చేశారే తప్పా అణగారిన వర్గాలకు చేయలేదన్నారు. దళిత, గిరిజన, బహుజన, మైనార్టీలకు దివంగత ఎన్టీఆర్, వైఎస్సార్‌ల తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే మేలు చేశారని, ఆ వర్గాలన్నీ ఆయనకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య, నాయకులు పాకా సురేష్, జయచంద్రారెడ్డి, నాగేంద్రారెడ్డి, సీహెచ్ వినోద్ కుమార్, వేణుగోపాల్ నాయక్, డా. శివానాయక్, సుభాన్‌బాషా, షఫీ, టీపీ వెంకటసుబ్బమ్మ, రత్నకుమారి, క్రిష్ణవేణి, ఉమామహేశ్వరి, సుశీలమ్మ పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే : జేసీ సాయికాంత్ వర్మ



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ సాయికాంత్ వర్మ

కడప సిటీ : మహాత్మా జ్యోతిబా పూలే అందరికీ ఆదర్శప్రాయుడని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలు జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. జేసీ సాయికాంత్ వర్మ, డీఆర్వో గంగాధర్ గౌడ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మయ్య, ఎస్టీ, ఎస్సీ కార్పొరేషన్ల ఈడీ వెంకటసుబ్బయ్య, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జ్యోతిబా పూలే వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి అన్నారు. గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, బీసీ సంక్షేమ అధికారి బ్రహ్మయ్య, పూసర్ల, కృష్ణ బలిజ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమారి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటసుబ్బమ్మ, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీ నరసింహ, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణస్వామి, తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చౌడం రవిచంద్ర, సాగర కార్పొరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లయ్య ప్రసంగించారు. అంతకు ముందు జ్యోతిబా పూలే చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.




పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శమని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ పూలే సామాజిక తత్వవేత్తగా సమాజంలో అనేక విధాలుగా ప్రజలను చైతన్యం పరిచారన్నారు. వితంతు పునర్వివాహం గురించి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చారన్నారు. అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడన్నారు. ప్రతి ఒక్కరూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ బి.రమణయ్య, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్‌ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, డీపీఓ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'కోవిడ్‌పై అప్రమత్తంగా ఉందాం

- ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు పాటించాలి
- మాక్ డ్రిల్ పర్యవేక్షణలో వైద్యాధికారులు



కడప రూరల్: ఇతర రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. ఆ మేరకు జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖల పర్యవేక్షణలో మంగళవారం సంబంధిత ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్‌ను చేపట్టారు. కడపలోని ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రితో పాటు ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా వ్యాప్తంగా ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఏరియా ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రులకు సంబంధించి కడపలోని తిరుమల, రామాస్ శ్రీకర, పల్లా, కడప, హిమాలయ, సిటీ కేర్, ఫాతియా ఆసుపత్రులు, ప్రొద్దుటూరులో కేవీర్, హర్ష, బద్వేల్‌లోని ఎస్సీఎస్‌ఎస్ కోవిడ్ ఆసుపత్రుల్లో మౌళిక సదుపాయాలైన ఆక్సిజన్, వెంటిలేటర్స్, మందుల లభ్యత తదితర అంశాలను పరిశీలించారు.

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ మనకు కరోనా కేసుల తాకిడి లేదన్నారు. అయితే ముందుస్తు జాగ్రత్తగా కరోనా వస్తే ఎదుర్కోవడానికి కోవిడ్ వైద్య సేవలు అందించే ఆసుపత్రులు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలన్నారు. జలుబు, జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలు ఉంటే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలి, భౌతిక దూరం పాటించాలి, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

తుదిదశకు లోకాయుక్త విచారణ

- హార్సిలీహిల్స్ సొసైటీ భూములపై సమగ్ర దర్యాప్తు
- రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలపై పూర్తిస్థాయి వివరాలు సేకరణ
- త్వరలో జస్టిస్ లక్ష్మణరెడ్డికి నివేదిక

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి 1974లో ప్రభుత్వం విక్రయించిన భూముల స్థితిగతులపై సమగ్ర విచారణ తుదిదశకు చేరుకుంది. గతేడాది ఆగస్టులో సొసైటీ భూములపై సమగ్ర దర్యాప్తునకు లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదేశిస్తూ లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ (దర్యాప్తు) గంగరాజును నియమించారు. ఎన్నో చిక్కుముళ్లతో నిండిన సొసైటి భూముల వ్యవహారంపై అధ్యయనానికే చాలా రోజులు పట్టింది. రికార్డులు, కోర్టు కేసులపై అవగాహన పెంచుకున్నాకే క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించాల్సి వచ్చింది. విచారణ కోసం బి.కొత్తకోట తహసీల్దార్, మదనపల్లె సహకార డిప్యూటీ రిజిస్ట్రార్‌లను గంగరాజుకు సహాయకులుగా కలెక్టర్ నియమించారు. సుదీర్ఘంగా సొసైటీ భూముల వ్యవహారంపై జరిగిన విచారణ ముగింపు దశకు వచ్చింది. 1980 దశాబ్దంలో ప్లాట్లు పొందిన కొందరు, ఓ వ్యక్తిచేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేపట్టారు.

వెలుగులోకి వాస్తవాలు..

1974 నవంబర్ 30న అప్పటి ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి హార్సిలీహిల్స్‌పై 20.60 ఎకరాలను కట్టబెట్టగా మార్కెట్ ధరను చెల్లించి భూమి స్వాధీనం చేసుకున్నారు. 1979 నుంచి 1985 మధ్యలో సభ్యులకు బినామీలు, ఒకే కుటుంబానికి చెందినవారి పేరిట, లేని వ్యక్తుల పేర్లతో ప్లాట్లు కేటాయించారన్న ఆరోణలపై వాస్తవాలు వెలికితీసినట్టు సమాచారం. కోర్టు స్టే ఉన్నట్టు కొన్నేళ్లుగా ప్రచారంలో ఉన్న సొసైటీకి చెందిన ఆక్రమిత భూమిపై స్టే లేదని వెలుగుచూసింది. 2007లో సహకార అధికారి డాక్టర్ పీఎస్‌వీ రామాంజనేయులు దర్యాప్తులో వెలుగుచూసిన అవినీతి, అక్రమాల ఆధారంగా కేసు నమోదుకు అప్పటి మదనపల్లె డివిజనల్ సహకార అధికారి లక్ష్మీ బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆరా తీశారు. సొసైటీకి ప్రభుత్వం విక్రయించిన భూములు సొసైటికే చెందుతాయని 2013లో సీసీఎల్ఓ తీర్పు చెప్పింది. దీనిపై రెవెన్యూ అధికారులు హైకోర్టును ఆశ్రయించగా కేసు నడుస్తోంది. దీనితోపాటు ప్రైవేటు వ్యక్తుల మధ్య నడుస్తున్న కోర్టు కేసులు, వారి వివరాలను సేకరించి పరిశీలించారు.

సొసైటీ ప్రారంభం నుంచి

ఏయే చైర్మన్ల పాలనలో ఎవరెవరికి ప్లాట్లు కేటాయించారు, ప్రస్తుతం వాటి పరిస్థితి. ఆదాయ, వ్యయాలు, నిర్వహణ రికార్డుల పరిశీలన సమగ్రంగా పూర్తయింది. 1980లలో సినీ తారలకు కేటాయించిన ప్లాట్లపైనా విచారణ జరిగింది.

రెవెన్యూ ద్వారా వివరాలు

హార్సిలీహిల్స్ సొసైటీ భూములపై రెవెన్యూ అధికారులు వివరాలు సమర్పించినట్టు తెలిసింది. దీనిపై విచారణ అధికారి గంగరాజు మాట్లాడుతూ విచారణ పూర్తి చేస్తున్నామని చెప్పారు. పలుకోణాల్లో దర్యాప్తు చేశామని, వివరాలను సేకరించామని తెలిపారు. పూర్తి నివేదికను లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డికి అందజేస్తామన్నారు.

యురేనియం ప్రాజెక్టుకు చేరుకున్న సీఎండీ

వేముల : మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టుకు యూసీఐఎల్ సీఎండీ హస్నాని మంగళవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం యురేనియం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ప్రాజెక్టులో ఆశించిన మేర ఉత్పత్తి రావడంతోపాటు స్థానిక అధికారులతో సమస్యలపై చర్చించనున్నట్లు సమాచారం.

రవికుమార్‌కు 'అంబేడ్కర్ రత్న' అవార్డు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన రవికుమార్ డాక్టర్ అంబేడ్కర్ రత్న–2023 జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఢిల్లీకి చెందిన భారతీయ బుద్ధ సంఘ్ జాతీయ అధ్యక్షులు భంతె సంఘప్రియ రాహుల్ ఈ మేరకు ఆయనకు ఆహ్వానం పంపారు. డాక్టర్ అంబేడ్కర్ రత్న–2023 సమ్మాన్ సమారోహ్ పేరిట ఈనెల 15వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఢిల్లీలోని జంతర్ మంతర్ సంసద్ మార్గ్‌లో పాలికా కేంద్రం ఎన్‌డీఎంసీ ఆడిటోరియంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. కడపలో 1987 నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత వర్గాల అభివృద్ధి సంఘం (దాదాస్) ఏర్పాటు చేసి అందించిన సేవలకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

కాలిపోయిన చీనీ చెట్ల పరిశీలన


కాలిపోయిన చెట్లను పరిశీలిస్తున్న సుధీర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో అగ్ని ప్రమాదంలో కాలిపోయిన చీనీ చెట్లను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహా మండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. పంచాయతీ సర్పంచ్ అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ నేత రామిరెడ్డిల చీనీ తోట మంగళవారం దగ్ధమైంది. సుమారు 200 చీనీ చెట్లు, 40 నేరేడు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అలాగే పొలంలోని డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి వుంది. రాత్రి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహా మండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి కాలిపోయిన తోటను పరిశీలించారు. బాధితులతో వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

స్కూటర్ల దొంగ అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితుడు

రాయచోటి టౌన్ : వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 8 స్కూటర్లను దొంగలించిన కేసులో నిందితుడిని రాయచోటి అర్బన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అర్బన్ సీఐ సుధాకరరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి – గాలివీడు రోడ్డు మార్గంలోని పాదలపల్లె సమీపంలో శ్రీ సత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం గోకనపల్లెకు చెందిన షేక్ దర్బార్ వలిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 8 స్కూటర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, కదిరిలో రెండు, చింతకొమ్మదిన్నెలో ఒకటి స్కూటర్ల దొంగతనం కేసులు నమోదు అయ్యాయి. అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఆర్.ఓ.సి.నెం. 1133/2022/ఎ1, తేది: 11.04.2023

ప్రొద్దుటూరు పురపాలక సంఘము

బహిరంగ వేలం ప్రకటన

ప్రొద్దుటూరు పురపాలక సంఘము టి.బి. రోడ్ – వై.యం.ఆర్ కాలనీ వాటర్ ట్యాంక్ దగ్గర గల మునిసిపల్ స్థలములో నూతనంగా నిర్మించిన భవనములు గుడ్‌విల్ పద్ధతిలో (వాడను చేయబడినది) జనరల్ కేటగిరి క్రింద నెలసరి బాడుగ ప్రాతిపదిక పై 5 సంవత్సరముల కాలమునకు నెలసరి బాడుగకిచ్చుటకు నెలసరి బాడుగపై తేది. 18.04.2023 మంగళవారం ఉదయం 11.00 గంటల నుండి మునిసిపల్ ఆఫీసు నందు బహిరంగవేలము జరుపబడును. వివరములు ఈ క్రింద తెలుపబడినవి.

వ.నెం.	భవనము వివరములు	కేటగిరి	వేలమునకు ముందు చెల్లించ వలసిన ధరావత్తు (రూపాయలలో)	కమీషనరు/ మండల రెవెన్యూ అధికారి గారిచే జారీ చేయబడిన సాల్వెన్సీ ధ్రువ పత్రం (రూపాయలలో)	గుత్త కాలము
1	2		3	4	5
1	బ్లాక్ నెం.1 (గ్రౌండ్ ఫ్లోర్ & మొదటి అంతస్థు)	జనరల్	5,00,000/-	5,00,000/-	5 సంవత్సరములు
2	బ్లాక్ నెం.2 (గ్రౌండ్ ఫ్లోర్ & మొదటి అంతస్థు)	జనరల్	5,00,000/-	5,00,000/-	

బహిరంగ వేలములో పాల్గొను పాటదారులు వేలమునకు ముందుగా పై తెలిపిన వేలపు ధరావత్తు మరియు సాల్వెన్సీ ధృవపత్రం సమర్పించి, వై.యస్.ఆర్. జిల్లా అసాధారణ గజిట్ నెం. 178/2022, తేది 07.11.2022 లోని నిబంధనలకు కట్టుబడి వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

కమీషనరు, ప్రొద్దుటూరు పురపాలక సంఘం

రిమ్స్‌కు మరో 19 పీజీ వైద్య సీట్లు


కేక్ కట్ చేసి ఆనందం పంచుకుంటున్న రిమ్స్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

కడప అర్బన్ : ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల(రిమ్స్)కు తాజాగా మంగళవారం మూడు విభాగాల్లో 19 పీజీ వైద్య విద్య సీట్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ ఆధ్వర్యంలో ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, వైద్య బృందం ప్రిన్సిపాల్ చాంబర్‌లో కేక్ కట్ చేసి ఆనందోత్సాహాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విలేకరులతో మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఆధ్వర్యంలో 11 విభాగాల్లో జరిపిన పరిశీలనల్లో 71 పీజీ సీట్లు మంజూరు కావాల్సి వుండగా.. ఇప్పటి వరకు నాలుగు విభాగాల్లో 28 పీజీ సీట్లు మంజూరయ్యాయన్నారు. మంగళవారం మూడు విభాగాలలో 19 పీజీ సీట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఇందులో ఫోరెన్సిక్ విభాగానికి 5, మైక్రోబయాలజీ విభాగానికి 9, పల్మనాలజీ విభాగానికి 5 పీజీ సీట్ల చొప్పున మంజూరయ్యాయన్నారు. దీంతో ఇప్పటి వరకు ఏడు విభాగాల్లో 47 పీజీ సీట్లు మంజూరయ్యాయన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ఈ 47 పీజీ సీట్లకు సంబంధించి అడ్మిషన్లు జరుగుతాయన్నారు. 2006లో ప్రారంభమైన రిమ్స్ ఎంబీబీఎస్ వైద్య విద్యా సంవత్సరం, 2013లో పీజీ వైద్య విద్యా కోర్సులు ఆరంభమయ్యాయన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 10 విభాగాల్లో 44 పీజీ సీట్లు వుండగా, మొత్తం 17 విభాగాల్లో 91 పీజీ వైద్య విద్య సీట్లకు చేరుకున్నాయన్నారు. పెరిగిన పీజీ వైద్య విద్య సీట్ల వల్ల వైద్య విద్యార్థుల్లో మరింత విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడం జరుగుతుందన్నారు. సమాజానికి మెరుగైన వైద్య సేవలు ఈ పీజీ సీట్ల ద్వారా సాధ్యమవుతుందని ప్రిన్సిపాల్ ఆనందం వ్యక్తం చేశారు. కడప రిమ్స్ వైద్య కళాశాల 2006లో స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు 91 పీజీ వైద్య విద్య సీట్లకు అనుమతి లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీంతో పీజీ వైద్య విద్యను అభ్యసించే వైద్య విద్యార్థులకే కాక, జిల్లా వాసులకు, చుట్టుపక్కల జిల్లాల వాసులందరికీ మెరుగైన వైద్య సేవలను అందించడమనేది గొప్పగా భావిస్తున్నామన్నారు. ఫోరెన్సిక్ వైద్య విభాగంలో ఐదు పీజీ సీట్లు రావడం వల్ల ప్రజలకు, సమాజానికి మెడికో లీగల్ సేవలు మరింత విస్తృతమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీబాయి, ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శంకర్‌రెడ్డి, ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

ఈత.. కడుపు కోత

విద్యార్థి మృతి


మృతి చెందిన దినేష్

కలసపాడు : ఓ విద్యార్థి ఈతకు వెళ్లి మృతి చెందడంతో తల్లిదండ్రులకు కడుపు కోత మిగిలింది. కలసపాడు మండలంలోని పిడుగుపల్లెకు చెందిన కొమ్మాల పాటి వసంతశేఖర్, నారాయణమ్మ కుమారుడు దినేష్ (14) మంగళవారం ఈతకు వెళ్లి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దినేష్ కాశినాయన మండలంలోని వంకమర్రి సగిలేరు గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుండే వాడు. దినేష్ తన స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని చెరువులోకి ఈతకు వెళ్లాడు. చెరువు లోతు ఎక్కువగా ఉండటంతో ఈత కొట్టలేక మునిగిపోతుండగా గమనించిన తోటి విద్యార్థులు బంధువులకు అందించారు. వారు వచ్చి చెరువులో నుంచి దినేష్ బయటికి తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అవ్వా.. అర్థమైంది కదా!



గడపగడపకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వెళ్లి అందరికీ ప్రభుత్వ పథకాలపై వివరించడం ఆకట్టుకుంది. మంగళవారం వేంపల్లె మండలం ఇడుపులపాయ పంచాయతీలోని మారుతినగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓ వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలను వివరించారు. – వేంపల్లె

గంజాయి ముఠా ఆటకట్టు

12 మంది సభ్యుల అరెస్ట్


గంజాయి ముఠా సభ్యుల అరెస్ట్ చూపుతున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

గుర్రంకొండ : గుర్రంకొండలో గంజాయి ముఠా సభ్యుల్ని 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక జీవన్‌తోపు వద్ద ఉన్న ఓ బండ వద్ద పెద్ద ఎత్తున గంజాయి విక్రయించడంతోపాటు పలువురు సేవిస్తున్నారనే సమాచారం అందుకొన్న పోలీసులు రాయచోటి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. పలువురు బండపై ప్లాస్టిక్ సంచుల్ని కలిగి పారిపోవుట ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకొన్నారు. తహసీల్దార్ ఖాజాబీ అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. విష్ణువర్ధన్(21) మదనపల్లె, పటాన్ సల్మాన్‌ఖాన్(21) గుర్రంకొండ, సయ్యద్‌బారో(21) గుర్రంకొండ, కె.ఆదిల్(19) గుర్రంకొండ, షేక్ మస్తాన్(21) గుర్రంకొండ, కురాకుల మహేష్(24) మదనపల్లె, కె.మల్లయ్య(59), పి.రాజేష్‌రెడ్డి(31) రేణిగుంట, తిరుపతి జిల్లా, కె.మునిసాయి(24) బుచ్చినాయిడు కండ్రిగ, చిత్తూరు జిల్లా, పి.శివకుమార్‌రెడ్డి(33) మదనపల్లె, గుర్రంకొండకు చెందిన లాతిఫ్(21), రెడ్డిప్రసాద్(22)పై కేసు నమోదు చేసినట్లు రాయచోటి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. వారి వద్ద నుంచి 12 సెల్ ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు, రూ.5000 స్వాధీనం చేసుకొన్నామని ఆయన పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కలకడ సీఐ నాగేంద్ర, గుర్రంకొండ ఎస్ఐ దిలీప్‌కుమార్, సిబ్బందికి రివార్డులు అందజేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడ్డ లోహిత్‌రెడ్డి

సంబేపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సంబేపల్లె మండల కేంద్రంలో మంగళవారం ఐచర్ వాహనం దూసుకెళ్లడంతో లోహిత్‌రెడ్డి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన చోటు చేసుకుంది. శంకరాపురానికి చెందిన లోహిత్‌రెడ్డి సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై వెళుతుండగా పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే.. దేవపట్ల వైపు నుంచి ఐచర్ వాహనం వేగంగా వచ్చి ముందు వెళుతున్న బొలేరోను ఢీకొని లోహిత్‌రెడ్డి ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇళ్లలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లోహిత్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కడపకు తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

వాహన చక్రంలో కాలు పెట్టడంతో..

మదనపల్లె : కురబలకోట మండలం బైసానివారిపల్లెకు చెందిన రామచంద్రారెడ్డి (65) తనకు పరిచయస్తుడైన రామస్వామి (64)తో కలిసి ద్విచక్రవాహనంలో మంగళవారం మదనపల్లె నుంచి ముదివేడుకు బయలుదేరారు. ముదివేడు క్రాస్ వద్ద రామచంద్రారెడ్డి ప్రమాదవశాత్తు కాలు వాహన చక్రంలో పెట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కేసీలో గలగల.. పంటలు కళకళ


రాజుపాళెం వద్ద కేసీ కాలువలో ప్రవహిస్తున్న నీరు


వాసుదేవాపురంలో పచ్చగా ఉన్న నూగు పంట

ఈ ఏడాది కేసీ చాపాడు, ప్రధాన కాలువకు నీరు సంపూర్తిగా రావడంతో పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగైన మినుము, పెసర, వరి, మొక్కజొన్న, శనగ తదితర పంటల నూర్పిళ్ల అనంతరం రైతులు రెండో పంటగా నూగు, కొర్ర, సజ్జ, వేరుశనగ, వరి తదితరాను సాగు చేశారు. ప్రస్తుతం కేసీ చాపాడు, కేసీ ప్రధాన కాలువల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం పంటలకు నీటి తడులు అందించడంతో కళకళలాడుతుండటంతోపాటు దిగుబడులు బాగానే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఆ నీరు పంటలకే కాక గొర్రెలు, మేకలు, పశువులకు దప్పికను తీరుస్తున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – రాజుపాళెం

మహిళ అదృశ్యం

కడప అర్బన్ : కడప రిమ్స్ పీఎస్ పరిధిలో రామకృష్ణనగర్‌కు చెందిన వసంత సింధూరి (32) అనే మహిళ మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయింది. టాక్సీ డ్రైవర్‌గా పని చేస్తున్న పుల్లయ్యకు, వసంత సింధూరికి కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వసంత సింధూరి స్థానికంగా వలంటీర్‌గా పని చేస్తోంది. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల విచారణ చేసినా ఫలితం లేకపోవడంతో పుల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప రిమ్స్ పీఎస్ సీఐ రామచంద్ర తెలియజేశారు.

పచ్చదనాన్ని పెంచాలి


పనులను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

సిద్దవటం: తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో పచ్చదనాన్ని పెంపొందించాలని తహసీల్దారు శంకర్‌రావుకుక ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దారు కార్యాలయం గోడల వద్ద ఏర్పాటు చేసిన బంకులను ఎత్తివేయాలన్నారు. ఎంతో మహర్దశను సంతరించుకున్న సిద్దవటం నాడు జిల్లా కేంద్రంగా కొనసాగిందని అప్పట్లో జిల్లా కలెక్టర్‌గా సర్ థామస్ మన్రో కొనసాగేవారన్నారు. కార్యాలయంలోని రికార్డు రూమును పరిశీలించిన ఆయన బ్రిటీష్ హయాంలో నిర్మించిన రికార్డు రూము చూడముచ్చటగా ఉందని కొనియాడారు. తహసీల్దారు శంకర్ రావు, డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌క్రిష్ణ, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. క్లీనర్ దుర్మరణం


మృతి చెందిన హుస్సేన్‌షా

గుర్రంకొండ : కోళ్ల లోడ్‌తో వెళుతున్న మినీ లారీ బోల్తా పడటంతో క్లీనర్ దుర్మరణం చెందగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన గుర్రంకొండలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రాయచోటికి చెందిన మినీ లారీ మంగళవారం వాల్మీకిపురం వద్దకు చేరుకుంది. అక్కడ కోళ్ల ఫారమ్‌లో కోళ్లను లారీలో లోడ్ చేసుకొని తిరిగి రాయచోటికి బయలుదేరింది. మార్గంమధ్యలో స్థానిక మార్కెట్ యార్డుకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈసంఘటనలో వైఎస్సార్ జిల్లా వేంపల్లెకు చెందిన క్లీనర్ షేక్ హుస్సేన్ షా(44) అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా డ్రైవర్ చిన్నాకు తీవ్ర గాయాలు కావడంతో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట వద్ద మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మండల పరిధిలోని ఆర్ గొల్లపల్లి గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి(58) మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

సచివాలయం తనిఖీ

సంబేపల్లె : మండల కేంద్రంలోని సచివాలయాన్ని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి మనోహర్‌రాజు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో మరిన్ని సేవలు పెంచాలి, సర్వేలు సక్రమంగా చేయాలన్నారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

నూతన ఒరవడి

- కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో కలెక్టరేట్‌కు ఏర్పాట్లు
- అందులో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండేలా చర్యలు
- రాయచోటి రింగ్‌రోడ్డు సమీపంలో 60 ఎకరాల స్థల సేకరణ
- ప్రస్తుత పాత కలెక్టరేట్ ఆనుకుని కలెక్టర్, జేసీ, డీఆర్వో బంగ్లాలు


కొత్త కలెక్టరేట్ ప్రభుత్వ భవనాల సముదాయానికి ఎంపిక చేసిన స్థలం

సాక్షి, రాయచోటి : పునర్విభజనలో భాగంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఇప్పుడిప్పుడే వసతులు సమకూరుతున్నాయి. జిల్లా ఇప్పటికే అభివృద్ధి బాట పట్టగా... మరి కొన్ని ప్రగతి పనులు ప్రతిపాదన దశలో ఉన్నాయి. కొత్తగా జిల్లా ఏర్పడినప్పటికీ ఏడాది కాలంలోనే అన్ని మౌలిక సదుపాయాలతోపాటు ఇతర అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు కంకణం కట్టుకుని ముందుకు వెళుతున్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు అన్ని నియోజకవర్గాల్లోనూ అవసరానికి తగ్గట్టుగా బాటలు వేస్తున్నారు. అలాగే అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో నూతన కలెక్టరేట్‌తోపాటు ఇతర కార్యాలయాల భవనాల సముదాయానికి స్థలాన్ని ఎంపిక చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం కొనసాగుతున్న కలెక్టరేట్ వెనుక వైపునే ఉన్నతాధికారుల బంగ్లాల నిర్మాణానికి పథక రచన చేశారు.

జిల్లా కేంద్రానికి కొత్త కలెక్టరేట్

కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు సంబంధించి అన్ని వసతులు కల్పించేందుకు అధికార యంత్రాంగం పథక రచన చేసింది. ప్రత్యేకంగా కలెక్టరేట్‌తోపాటు అన్ని కార్యాలయాలు ఒకే ప్రాంతంలో ఉంటే.. ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి జిల్లా కలెక్టర్ గిరీషా, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి నూతన కలెక్టరేట్ సముదాయానికి అవసరమైన 60 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు.

కలెక్టరేట్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నారు. నూతన కలెక్టరేట్ భవనాలతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, హెచ్ఓడీల ఆఫీసులు, కలెక్టర్, ఎస్పీ, జేసీ, డీఆర్వో తదితర అధికారుల భవనాల నిర్మాణాలకు స్థలాన్ని ఎంపిక చేశారు. రాయచోటి రింగ్‌రోడ్డులోని వేంపల్లె–గాలివీడు రహదారి సమీపంలో స్థలాన్ని నూతన కలెక్టరేట్‌కు ఎంపిక చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా ప్రత్యేకంగా కలెక్టరేట్ ప్రాంతాన్ని పరిశీలించడంతోపాటు పూర్తిగా అవసరమైన భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇక్కడే కలెక్టరేట్‌తోపాటు అన్ని ప్రభుత్వ భవనాల సముదాయాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రస్తుత కలెక్టరేట్ పక్కనే బంగ్లాల నిర్మాణం

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ వెనుకభాగాన్ని ఉన్నతాధికారుల బంగ్లాల నిర్మాణాలకు స్థల ఎంపిక చేశారు. కలెక్టర్, జేసీ, డీఆర్వో బంగ్లాలకు సుమారు 8 ఎకరాల స్థలాన్ని కేటాయించి చదును చేశారు. బండ రాళ్లను పూర్తిగా తొలగించి సరిచేయడంతోపాటు ప్రత్యేకంగా ఎంపిక చేసిన స్థలం చుట్టూ హద్దులు గుర్తించి చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు.

ఒకే చోట ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం



రాయచోటిలోని రింగ్‌రోడ్డు సమీపంలో నూతన కలెక్టరేట్ నిర్మాణాలకు స్థల ఎంపిక చేశాం. కలెక్టరేట్ భవనాలతోపాటు ఎస్పీ, జేసీ, ఇతర అన్ని శాఖల కార్యాలయాలు నిర్మించనున్నాం. అందుకోసం సుమారు 60 ఎకరాల స్థలాన్ని కేటాయించి చదును చేసే కార్యక్రమం చేపడుతున్నాం. ప్రస్తుతమున్న కలెక్టరేట్ ప్రక్కనే కలెక్టర్, జేసీల బంగ్లాలు నిర్మించనున్నాం. అందుకు సంబంధించి త్వరలో శంకుస్థాపన చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. అభివృద్ధిలో అన్నమయ్య జిల్లాను అగ్రగామిగా నిలపడమే లక్ష్యం. – పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా